ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్

తొమ్మిదోసారి హస్తినకు

- సీఎం వెంట మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు
- రెండురోజులపాటు అక్కడే మకాం
- నేడు కేంద్ర మంత్రులతో భేటీ
- పార్టీ పెద్దలనూ కలిసే అవకాశం
- నామినేటెడ్ పోస్టులు, పార్టీలో చేరికలు, ఎంపీ టికెట్లపై చర్చ

ఆధ్యాత్మికవేత్త త్రిదండి చినజీయర్ స్వామి సోమవారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. త్వరలో నిర్వహించనున్న శ్రీ రామానుజాచార్య 108 దివ్య దేశాల సమతాకుంభ్-2024 బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): రెండు రోజుల పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉన్నారు. సోమవారం రాత్రి హోటల్ అశోకమౌర్యలో జరిగిన ఏఐసీసీ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా కుమారుడి వివాహానికి రేవంత్ హాజరయ్యారు. మంగళవారం కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, హర్దీప్‌సింగ్ పూరి, అశ్విన్‌వైష్ణవ్‌తో సీఎం భేటీకానున్నట్టు సమాచారం. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కేంద్రంలో వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై సీఎం చర్చించనున్నట్టు తెలిసింది.

పార్టీ పెద్దలతో భేటీ

ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం పార్టీ పెద్దలతో భేటీ కానున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగియడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపట్టాలని సీఎం భావిస్తున్నారు. ఇప్పటికే టీపీసీసీ నుంచి పార్టీ అధిష్ఠానానికి నామినేటెడ్ పోస్టుల భర్తీపై జాబితా అందింది. తమతో చర్చించకుండా నామినేటెడ్ పోస్టుల భర్తీపై నిర్ణయం తీసుకోవద్దని సీనియర్ నేతలు మొకాలు అడ్డడంతో ఈ అంశంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి చర్చించనున్నారని సమాచారం. వివిధ సమీకరణల వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని ముఖ్య నేతలకు నామినేటెడ్ పదవులు ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీలో వీరికి ప్రాధాన్యత కల్పించే అంశాన్ని ప్రస్తావించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఆశించే నేతలు కొందరిని ముందే బరినుంచి తప్పించేందుకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టాలని సీఎం భావిస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం ఎంపీ టికెట్ ఆశించిన కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరికి రాజ్యసభకు అవకాశం కల్పించింది. వరంగల్ ఎంపి టికెట్ ఆశిస్తున్న మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. ఎంపీ టికెట్ ఆశిస్తున్న మరికొందరికి కూడా ఇలానే నామినేటెడ్ పదవులు కట్టబెట్టే అంశంపై అధిష్ఠానంతో సీఎం చర్చిస్తారని సమాచారం. పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేతగాని ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయన అక్కడి నుంచే తిరిగి బరిలోకి దిగాలని యోచిస్తున్నారు. వరంగల్ నుంచి టికెట్ ఆశిస్తూ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కాంగ్రెస్‌లో చేరడానికి ఆసక్తి కనబరస్తున్నారు. ఈ అంశాలన్ని అధిష్ఠానంతో సీఎం చర్చించనున్నారని సమాచారం. మరోవైపు, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయాలని సీఎం భావిస్తున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభించని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి మంత్రివర్గంలో ఎవరికి అవకాశం కల్పించాలనే అంశంపైనా చర్చిస్తారని చెప్తున్నారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఇది తొమ్మిదోసారి.

చారిత్రక కట్టడాలను కలుపుతూ మూసీ అభివృద్ధి

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): చారిత్రక కట్టడాలను కలుపుతూ మూసీ అభివృద్ధికి ప్రణాళికలు రచించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నానక్‌రామ్‌గూడలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో సోమవారం మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మూసీ నది సరిహద్దులు, ఇతర అంశాలను పటాల సాయంతో అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూసీ అభివృద్ధి ప్రక్రియ వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు కసరత్తు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నింటికంటే ముందుగా మూసీ నది శుద్ధి ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.

పెద్దపల్లిలో గొడవ వద్దని కౌన్సిలర్ శ్రీనివాస్‌కు చెప్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ కౌన్సిలర్ల తన్నులాట

- పెద్దపల్లిలో కౌన్సిలర్ల అనుచరుల రణరంగం
- విజయరమణారావుకు చేదు అనుభవం

పెద్దపల్లి, ఫిబ్రవరి 19: పెద్దపల్లి కాంగ్రెస్‌లో విభేదాలు భగ్గుమన్నాయి. పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారి మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి వచ్చిన చింతకుంట విజయరమణారావుకు చేదు అనుభవం ఎదురైంది. ఎమ్మెల్యే ఎదుటే కాంగ్రెస్ కౌన్సిలర్లు ఇద్దరు పరస్పరం తోసుకోగా, కార్యకర్తలు పిడిగుద్దులు గుద్దుకున్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీ కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లను సోమవారం ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వచ్చారు. కొబ్బరి కాయలు కొట్టే క్రమంలో కౌన్సిలర్లు కొలిపాక శ్రీనివాస్, నూగిళ్ల మల్లయ్య మధ్య తోపులాట జరిగింది. దీంతో మల్లయ్య.. శ్రీనివాస్‌ను పక్కకు జరుగమనడంతో ఇద్దరిమధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. పోలీసులు వారిని నిలువరించడంతో ఎమ్మెల్యే ట్రాక్టర్లను ప్రారంభించారు. అనంతరం బడ్జెట్ సమావేశం జరుగుతున్న సమయంలో కౌన్సిలర్ల అనుచరులు అక్కడికి చేరుకున్నారు. సమావేశ మందిరంలోకి వెళ్లి కొట్టుకున్నారు. ఎమ్మెల్యేతోపాటు కౌన్సిలర్ శ్రీనివాస్ బయటకు వచ్చి నూగిళ్ల మల్లయ్య అనుచరులు దాడి చేశారని ఆరోపించారు. ముదిరాజ్‌లను మున్నూరు కాపులు అణగదొక్కుతున్నారని శ్రీనివాస్ మండిపడ్డారు. గొడవ జరగుతుండగానే ఎమ్మెల్యే అక్కడినుంచి వెళ్లిపోయారు. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి అక్కడినుంచి పంపించారు. కౌన్సిలర్లు శ్రీనివాస్, మల్లయ్య పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో విప్ లక్ష్మణ్‌కు గాయాలు

- ఫోన్‌లో పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కరీంనగర్‌లోని అపోలో దవాఖానలో చికిత్స పొందుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, ఫిబ్రవరి 19 : రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గాయపడ్డారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం అంబారిపేట శివారులోని మూల మలుపువద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు కారు బోల్తా కొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్‌కుమార్ ఛాతీ భాగానికి, ఎడమకాలికి గాయాలయ్యాయి. కారులో డ్రైవర్, ఇద్దరు గన్‌మెన్లు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, కాంగ్రెస్ నాయకులు అక్కడికు చేరుకొని వారిని కరీంనగర్ అపోలో దవాఖానలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం లక్ష్మణ్‌కుమార్‌ను హైదరాబాద్ యశోద దవాఖానకు తరలించారు. లక్ష్మణ్‌కుమార్‌కు ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ చేసి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొన్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

ఛత్రపతి శివాజీ రైతు నేస్తం

- సీపీఐ నేత నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ)/హిమాయత్‌నగర్: రైతు నేస్తంగా ఉంటూ ఛత్రపతి శివాజీ మహారాజ్ పాలన కొనసాగించారని, నేడు ప్రధాని మోదీ రైతు శత్రువుగా మరి దుర్మార్గపు పాలన కొనసాగిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ ఆరోపించారు. ఛత్రపతి శివాజీ 394వ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఛత్రపతి ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ అనేక సంస్కరణలు తీసుకొచ్చారని వివరించారు.

'ఢిల్లీ'కి ఇచ్చేందుకే 1,600 కోట్ల స్కాం

- ఎన్నికల కోసం తరలిస్తున్న కాంగ్రెస్
- ధాన్యం టెండర్లలో భారీ అవినీతి
- దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



దుబ్బాకలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం టెండర్లలో భారీ అవినీతికి పాల్పడిందని, ఇందులో రూ.1,600 కోట్లను ఎన్నికల ఖర్చుల కోసం ఢిల్లీకి తరలించేందుకు కుట్ర జరుగుతున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. పేదల ప్రభుత్వం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. విలువైన ధాన్యాన్ని తక్కువ ధరకు కోట్ చేయించి అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఒక్కో క్వింటాల్‌కు రూ.450 చొప్పున మొత్తం 35 లక్షల టన్నుల ధాన్యానికి రూ.1,600 కోట్ల అవినీతికి పాల్పడిందని దుయ్యబట్టారు. ఈ డబ్బును ఎన్నికల ఖర్చుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తమ పార్టీ పెద్దలకు ఢిల్లీకి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపించారు. కాంగ్రెస్ అంటే అవినీతికి మారుపేరుగా మారిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వని తాభూంరెడ్డి, ఎంపీపీ పుష్పలతా కిషన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు డెంగ్యూ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖకు డెంగ్యూ జ్వరం వచ్చింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలోనే జ్వరం బారిన పడిన ఆమె తన కార్యక్రమాలను ఇంటి నుంచే పర్యవేక్షిస్తున్నారు. ఐదు రోజులుగా జ్వరం తగ్గకపోవడంతో డాక్టర్లు పలు వైద్య పరీక్షలు చేయడంతో డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో డాక్టర్ల పర్యవేక్షణలో మంత్రి కొండా సురేఖకు చికిత్స అందిస్తున్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి

- సన్నాహక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): రంజాన్ నెల సమీపిస్తున్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో తన అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో పొన్నం మాట్లాడారు. మసీదుల వద్ద శామియానాలు, నీటి వసతి, విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ఓవర్ లోడ్ పడినప్పుడు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఉంచడంతో పాటు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య బృందాలను అదనంగా ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సూచించారు. రంజాన్ మాసం సందర్భంగా షాపులు 24 గంటలు నడుపుకోవడాన్ని పరిశీలించాలని చెప్పారు. పుట్‌పాత్‌లపై ఉండే చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలిగించవద్దని తనిఖీల పేరుతో ఇబ్బందులు కలిగించద్దని పోలీస్ అధికారులకు సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ స్నేహలత శోభన్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశం, ఎంఐఎం ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, బలాలా, కౌసర్ మొయినుద్దీన్, మహమ్మద్ మజీద్ హుస్సేన్, మీర్ జుల్ఫికర్ అలీ, మహమ్మద్ ముబిన్, ఎమ్మెల్సీలు మీర్జా రహమాత్ బేగ్, మీర్జా రియాజుల్ హాసన్ ఎఫెండీ, ప్రిన్సిపల్ సెక్రటరీ ఉమర్ జలీల్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

సమాంతర రిజర్వేషన్‌తో అన్యాయం

జీవో నంబర్ 3ని ఉపసంహరించాలి

- ఉద్యోగ నియామకాల్లో మహిళలకు తీవ్ర నష్టం
- హారిజాంటల్ విధానంతో మహిళలకు రిజర్వేషన్లు దక్కవు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆందోళన.. సోనియా, ఖర్గేలకు లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో మహిళా రిజర్వేషన్‌లకు హారిజాంటల్ (సమాంతర) విధానాన్ని అనుసరించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు రిజర్వేషన్లు దక్కవని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వేల మంది మహిళలు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కవిత సోమవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 10న జారీచేసిన జీవో నం.3లో మహిళలకు రిజర్వేషన్లపై హారిజాంటల్ విధానాన్ని అవలంబించాలని నిర్ణయించిందని, మహిళలకు రోస్టర్ పాయింట్ లేకుండా చేశారని తెలిపారు. దీంతో తక్కువ సంఖ్యలో ఉండే ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు దక్కవని చెప్పారు. అర్హులైన మహిళలు లేకుంటే వాటిని కూడా పురుషులతో భర్తీ చేసే అవకాశం ఉన్నదని అన్నారు. హారిజాంటల్ విధానాన్ని గతంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం వ్యతిరేకించిందని, కోర్టును కూడా ఆశ్రయించిందని, తుది తీర్పు ఇంకా రాలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా ఆ కేసును వెనక్కి తీసుకుందని తెలిపారు. ఇదే విధానం కొనసాగితే మహిళలు 33 శాతం రిజర్వేషన్‌ను కొల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేస్తామని చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల్లో 66వేల ఉద్యోగాలు మహిళలకు రావాల్సి ఉందని, కానీ కొత్త విధానంలో ఆ అవకాశం ఉండదని తెలిపారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హారిజాంటల్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. తెలంగాణలో కూడా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోనియాగాంధీ, మల్లికార్జున్‌ఖర్గేకు లేఖ రాసినట్టు కవిత తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సోనియా, ఖర్గేకు లేఖ: కవిత

హారిజాంటల్ విధానంపై ఎమ్మెల్సీ కవిత సోనియాగాంధీ, మల్లి ఖార్జున ఖర్గేకు లేఖ రాశారు. ఆ లేఖలో ముఖ్యంశాలు...

'1996లో అనేక పోరాటాల ఫలితంగా మహిళలకు ఉపాధి అవకాశాల్లో 33.3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నంబరు 41, 56 జారీ అయ్యాయి. దీనికి 1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఇందిరా సాహ్నీ తీర్పు కూడా ఎంతో తోడ్పాటునిచ్చింది. ఆ తర్వాత రాజ్యాంగబద్ధంగా మహిళలకు రోస్టర్ పాయింట్లతో కూడిన హారిజాంటల్ రిజర్వేషన్లు కల్పించారు. ఇన్నేండ్ల నుంచి సాగుతున్న ఈ పద్ధతిని ఇటీవల రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకొని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల హక్కులను కాలరాస్తూ జీవో 41, 56ను రద్దు చేస్తూ ఈ నెల 10న కొత్తగా జీవో 3ను తీసుకొచ్చారు. రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా... మేము మహిళల హక్కులను హరించబోమని అంటూ 2023 జనవరిలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. కానీ మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 6న ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. తద్వారా మహిళల హక్కులను సంపూర్ణంగా. శాశ్వతంగా హరిస్తూ రోస్టర్ పాయింట్లు లేకుండా హారిజాంటల్ పద్ధతిలో రిజర్వేషన్లను కల్పిండానికి జీవో 3ను జారీ చేసింది. రిజర్వేషన్ల స్ఫూర్తిని పక్కనబెడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త జీవో తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఈ విషయంలో తమరు జోక్యం చేసుకొని ఆ జీవోను తక్షణమే వెనక్కి తీసుకునేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను' అని కోరారు.

కొత్తగూడెంలో వీగిన అవిశ్వాసం

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగనున్న కాపు సీతాలక్ష్మి

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ప్రిసైడింగ్ అధికారి మధు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 19: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మిపై సోమవారం మున్సిపల్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఎక్స్‌అఫీషియో సభ్యుడితో కలిపి మొత్తం 37 మంది సభ్యులు ఉన్నారు. అవిశ్వాసాన్ని ప్రతిపాదించిన కౌన్సిలర్లు ఎవరూ సమావేశానికి హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్టు ప్రిసైడింగ్ అధికారి డీ మధు ప్రకటించారు. దీంతో యథావిధిగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాపు సీతాలక్ష్మి కొనసాగనున్నట్టు ప్రిసైడింగ్ అధికారి మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టీ శేషాంజన్‌స్వామి, తహసీల్దార్ డీ పుల్లయ్య పాల్గొన్నారు. కాగా.. అవిశ్వాస తీర్మానం వీగిపోయిన అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి.. 'నమస్తే'తో మాట్లాడారు. నిజాయితీ, ధర్మం గెలిచిందని, కొంతమంది ప్రలోభాలకు లొంగి, పదవీ వ్యామోహంతో తనపై అవిశ్వాస తీర్మానం పెట్టారని, కానీ కౌన్సిలర్లు తనవైపు ఉండటం వల్ల అవిశ్వాసం వీగిపోయిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై కొత్తగూడెం మున్సిపాలి అభివృద్ధికి రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తానని చెప్పారు.

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం

- పెండింగ్ ఓటరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులకు

సీఈవో వికాస్‌రాజ్ ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ తరగతులను నిర్వహించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సోమవారం ఆయన జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా పరిశీలన చేయాలని, ఓటరు జాబితాలో మార్పులు-చేర్పులు, పేర్ల తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

పత్తి కొనుగోళ్లు కొనసాగించండి

- సీసీఐకి మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు కొనసాగించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ను కోరారు. కొనుగోలు కేంద్రాలను మూసేస్తే రైతులు ఇబ్బంది పడతారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సీసీఐకి లేఖ రాశారు. ఇప్పటికీ మార్కెట్లకు పత్తి వస్తున్నదని, కొందరు రైతులు మూడోసారి కోస్తుండటంతోపాటు మరికొందరు రైతుల వద్ద మొదటి పంట పత్తి నిల్వ ఉన్నదని తెలిపారు.

అర్వింద్‌కు వ్యతిరేకంగా ప్రచురించిన కరపత్రం

అహంకారి అర్వింద్ మాకొద్దు!

- కారు దిగడు.. అద్దాలు తీయడు
- కోరుట్ల, మెట్‌పల్లిలో కరపత్రాలు

మెట్‌పల్లి, ఫిబ్రవరి 19: 'ఆయన కారు దిగడు.. కండ్లద్దాలు తీయడు.. ప్రజలను చూడడు..వారితో మాట్లాడడు.. ఈ అహంకారి అర్వింద్ మాకొద్దు.. నియంతకు నిజామాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వద్దు' అంటూ జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో సోమవారం కరపత్రాల పంపిణీ కలకలం రేపుతున్నది. కరపత్రాలపై స్థానిక బీజేపీ నేతల పేర్లు ఉండటంతో సొంత పార్టీ వారి పనేనని ప్రచారం జరుగుతున్నది. 2019 ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా గెలిచిన అర్వింద్‌కు సొంత క్యాడర్ నుంచే ధిక్కార స్వరం వినిపిస్తున్నది. ఇప్పటికే పలువురు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతిపత్రాలు అందించగా, మరికొందరు ప్రెస్ మీట్లు పెట్టి, దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఇటీవల ఓ కార్యకర్త ఏకంగా ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం కరపత్రాల పంపిణీ చర్చనీయాంశమైంది.

ఉద్యోగాలిచ్చి న్యాయం చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి డీఎస్సీ 2008 బాధితుల విజ్ఞప్తి

రేవంత్‌రెడ్డిని కలిసేందుకు సోమవారం ఆయన నివాసానికి వచ్చిన డీఎస్సీ బాధితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేస్తూ తమకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని డీఎస్సీ-2008 బాధిత అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం భారీ సంఖ్యలో అభ్యర్థులు సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి చేరుకొన్నారు. ముఖ్యమంత్రి అందుబాటులో లేకపోవడంతో.. సీఎం వ్యక్తిగత కార్యదర్శి జైపాల్‌రెడ్డి, సీఎంవో కార్యదర్శి మాణిక్య రాజ్ వారితో చర్చించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో, 2008 డీఎస్సీలో నష్టపోయిన మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలని ఈ నెల 8న హైకోర్టు ప్రభుత్వానికి సూచించిందని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని నష్టపోయిన అభ్యర్థులకు అక్కడి ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఒకే నోటిఫికేషన్‌కు సంబంధించిన బాధితులకు ఒక రాష్ట్రంలో ఉద్యోగాలిచ్చి, మరో రాష్ట్రంలో రోడ్డున పడేయడం భావ్యం కాదని కోర్టు అభిప్రాయపడిందని చెప్పారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం కూడా ఉద్యోగాలిచ్చి వారిని ఆదుకోవాలని సూచించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో న్యాయం కోసం 15 ఏండ్లుగా ఎదురుచూస్తున్న తమకు ఇప్పటికైనా ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ.. ఈ అంశంపై సమగ్రంగా అధ్యయ